ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కృషి

- ఎస్‌టియు శిక్షణా తరగతుల్లో ప్రొఫెసర్ కోదండరాం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బదిలీలు, పదోన్నతులతో పాఠశాలల్లోని అన్ని ఖాళీలను నింపేందుకు ప్రభుత్వం ప్రయత్నించిందని తెలగాణ జన సమితి (టిజెఎస్) అధ్యక్షులు ప్రొఫెసర్ కోదండరాం తెలిపారు. ఆదివారం హైదరాబాద్ కాచిగూడలోని స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టియు) భవన్‌లో రాష్ట్ర అధ్యక్షులు ఎం.పర్వత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలపై మరింత విశ్వాసం కలిగించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. ప్రభుత్వ, ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం పట్ల సానుకూలంగా ఉందని చెప్పారు. ఇలాంటి సమయంలో విద్యారగ ప్రమాణాలు పెంచేలా విద్యాధికారులు, ఉపాధ్యాయుల కృషి అవసరమని అభిప్రాయపడ్డారు. తొలి ఉపాధ్యాయ సంఘంగా ఎస్టీయూ ఉపాధ్యాయ హక్కులను పరిరక్షించిందనీ, అనేక సమస్యలకు పరిష్కారాన్ని సాధించిందని అభినందించారు. అర్హులైన ఉపాధ్యాయులకు జూనియర్ లెక్చరర్లు, ఎంఇఒ, డిప్యూటీ ఇఒ పదోన్నతులకు సంబంధించి ప్రభుత్వంతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. సమస్యల పరిష్కారం కోసం సంఘాలన్ని కలిసి రావాలని సూచించారు. ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్షులు ఎం పర్వత్ రెడ్డి, కార్యదర్శి జి సదానందం గౌడ్ మాట్లాడుతూ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ పూర్తి చేయడం పట్ల ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. సంఘం సీనియర్ నాయకులు పి సుబ్బరాజు, ఎల్ సాయి శ్రీనివాస్ శిక్షణనిచ్చారు.

రాచకొండ గుట్టల్లో ఫిల్మ్ సిటీ

- మహేశ్వరం పరిసరాల్లో సైబరాబాద్ తరహా సిటీ
- హయత్‌నగర్ వరకు మెట్రో
- గౌడన్నలకు సేఫ్టీ కిట్లు పంపిణీ చేసిన సిఎం రేవంత్

గౌడన్నలకు సేఫ్టీ కిట్లు అందజేస్తున్న సిఎం రేవంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాచకొండ గుట్టల్లో అంతర్జాతీయ స్థాయిలో ఫిల్మ్‌సిటీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మహేశ్వరం పరిసర ప్రాంతాలను కలిపి న్యూయార్క్ నగరంతో పోటీపడేలా నూతన నగరాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పారు. మెట్రో రైలును నాగోల్ నుంచి ఎల్ బి నగర్ - హయత్ నగర్...ఎల్‌బినగర్ నుంచి ఒవైసీ ఆస్పత్రి - శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు విస్తరిస్తామని సిఎం తెలిపారు. ఆధునిక టెక్నాలజీతో హైదరాబాద్ ఐఐటి తయారు చేసిన సేఫ్టీ కిట్లను (కాటమయ్య రక్ష కిట్లు) సిఎం రేవంత్‌రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో నిర్వహించిన కార్యక్రమంలో గీత కార్మికులతో మాట్లాడిన సిఎం వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లష్కర్‌గూడ తాటివనంలో సిఎం ఈత మొక్క నాటారు. అనంతరం సిఎం మాట్లాడుతూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు గీత కార్మికులు పిల్లర్లుగా ఉన్నారని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి గౌడన్నలు సంపూర్ణ మద్దతు తెలిపారన్నారు. రియల్ ఎస్టేట్ పెరగడం వల్ల తాటి వనాలు తగ్గుతున్నాయని సిఎం రేవంత్‌రెడ్డి చెప్పారు. వన మహోత్సవంలో భాగంగా తాటి చెట్ల పెంపకాన్ని పరిశీలిస్తామన్నారు. రోడ్ల పక్కన వీటిని నాటాలనే నిబంధన విధిస్తామని పేర్కొన్నారు. కుల వృత్తులపై ఆధారపడిన కుటుంబాల పిల్లలు ఉన్నత చదువులు చదివి శాసనాలు చేసే స్థాయికి ఎదగాలని, తెలంగాణ పునర్నిర్మాణంలో వారు భాగస్వాములు కావాలని సిఎం ఆకాంక్షించారు. పిల్లలను కులవృత్తులకు పరిమితం చేయవద్దని సూచించారు. పేదలకు కూడా కార్పొరేట్ విద్య, వైద్యం అందాలని కాంగ్రెస్ ఆలోచించి ఫీజు రీయింబర్స్‌మెంట్, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకాలు తెచ్చిందని అన్నారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఒఆర్ఆర్ ,ఫార్మా పరిశ్రమలను కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందనీ.. ఫాం హౌస్‌లో ఉన్నోళ్లు ఏం తీసుకొచ్చారని రేవంత్ ప్రశ్నించారు. వారి హయాంలో డ్రగ్స్, గంజాయి తప్ప మరేం లేదని విమర్శించారు. ప్రభుత్వాన్ని పడగొడతామంటే ప్రజా ప్రభుత్వాన్ని కాపాడుకోవడానికే బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని సిఎం అన్నారు. పదేళ్ల పాటు కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందనీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఆందోళన చేస్తున్న నిరుద్యోగ అభ్యర్థులు ధైర్యంగా ఉండాలని, సమస్యలపై చర్చిస్తామని సిఎం హామీ ఇచ్చారు. అనంతరం గౌడన్నలతో కలిసి సిఎం, మంత్రులు,అధికారులు సహపంక్తి భోజనాలు కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, స్థానిక ఎంపి, ఎమ్మెల్యే, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి

పార్టీ ఫిరాయింపులు తప్ప.. ప్రజా సమస్యలు పట్టవా ?

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి ప్రశ్న

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు పార్టీ ఫిరాయింపులు తప్ప ప్రజా సమస్యలు పట్టడం లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. ఆదివారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని స్థానిక సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు అయిందని, కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 40 రోజులు దాటిందని, ఇప్పటివరకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వాలు ఏ మాత్రం దృష్టి పెట్టడం లేదని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా పార్టీ ఫిరాయింపులపై దృష్టి పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చిందని అందులో ఒకటి రెండు హామీలు తప్ప మిగిలిన పథకాలు అమలు చేయడం లేదని చెప్పారు. రైతు భరోసా, రైతు రుణమాఫీ, పెన్షన్ పెంపు, వ్యవసాయ ప్రణాళిక, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. రైతు భరోసా అమలు చేసేందుకు ఇప్పుడు రైతుల అభిప్రాయాలు సేకరించడం సరికాదని, ఆనాడు ఎన్నికల ముందు ఎవరి అభిప్రాయాలు తీసుకొని హామీ ఇచ్చారని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న 13 సమస్యలపై ఇప్పటికే ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని, వాటి పరిష్కారం కోసం కృషి చేయాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని లేకపోతే భవిష్యత్‌లో ప్రజాఉద్యమాలు మొదలవుతాయని హెచ్చరించారు. మోడీ ప్రభుత్వం పదేండ్లలో చేసిన తప్పులనే మళ్లీ చేస్తుందని చెప్పారు. రాష్ట్రంలో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నప్పటికీ రాష్ట్ర అభివృద్ధి కోసం దృష్టి పెట్టడం లేదని, కనీసం నిధులు తీసుకురావడంపైనా శ్రద్ధ చూపడం లేదన్నారు. కేవలం కాంగ్రెస్‌ను తిట్టేందుకే వారు ఉన్నట్టు కనిపిస్తుందని ఆరోపించారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్నందున రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు సకాలంలో అందించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, జిల్లా కమిటీ సభ్యులు డాక్టర్ మల్లు గౌతమిరెడ్డి, రెమిడాల పరుశురాములు, పాదూరి శశిధర్‌రెడ్డి, పగిడోజురామ్మూర్తి, పత్తిపాక అప్పారావు, ఉన్నం వెంకటేశ్వర్లు, చారి పాల్గొన్నారు.

గ్రూప్-2, 3 పరీక్షల వాయిదాకు విజ్ఞప్తి

నిరుద్యోగుల పట్ల నిరంకుశత్వం తగదు : ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలను వాయిదా వేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐ కోరాయి. నిరుద్యోగుల పట్ల నిరంకుశంగా వ్యవహరించకుండా వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని సూచించాయి. ఈ మేరకు ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్‌ఎల్‌మూర్తి, కార్యదర్శి తాళ్ల నాగరాజు, డివైఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్షులు కోటరమేశ్, కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. 'డిఎస్‌సి పరీక్షలను ఈనెల 18 నుంచి ఆగస్టు 5 వరకు ప్రభుత్వం నిర్వహిస్తున్నది. డిఎస్‌సి రాసే వారిలో గ్రూప్ -2, గ్రూప్ -3 అభ్యర్థులు కూడా ఉన్నారు. గ్రూప్- 2 పరీక్షలు ఆగస్టు ఏడు, ఎనిమిది తేదీల్లో ఉన్న నేపథ్యంలో డిఎస్‌సి రాసేవారికి ప్రిపరేషన్‌కు సమయం సరిపోదు. ఈ కారణంతోనే నిరుద్యోగులు కనీసం నెలపాటు గ్రూప్ పరీక్షలు వాయిదా వేయాలని కోరుతున్నారు. ఈ డిమాండ్ కూడా సరైనదే, గతంలో పేపర్ లీకేజీలు, టిజిపిఎస్‌సి తప్పిదాలతో రాష్ట్రంలో నిరుద్యోగులు చాలా కాలాన్ని నష్టపోయారు. డీఎస్సీ, గ్రూప్స్ సిలబస్ వేర్వేరు కాబట్టి రాష్ట్ర ప్రభుత్వం ఈ సున్నితమైన అంశంపై అభ్యర్థులతో చర్చించి పరిష్కారం ఎస్‌ఎఫ్‌ఐ, డివైఎఫ్‌ఐగా కోరుతున్నాం. నిరుద్యోగులను అరెస్టు చేసి కేసులు పెట్టడం, నిర్బంధించడం సరైన చర్య కాదు. గ్రూప్-1 నోటిఫికేషన్‌లో గ్రూప్-1 పోస్టుల కంటే అదనంగా 63 పోస్టులు పెంచి పరీక్ష నిర్వహించినట్టుగానే గ్రూపు-2, గ్రూపు-3లలో కూడా పోస్టులను పెంచే ఆలోచన చేయాలని విజ్ఞప్తి చేస్తున్నాం. అరెస్టు చేసిన నిరుద్యోగులను వెంటనే విడుదల చేయాలని కోరుతున్నాం' పేర్కొన్నారు.

సిఐటియు సమావేశంలో మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

ఇచ్చిన హామీలను అమలు చేయకుండా..

కార్మికులను మోసగిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్మికులకు అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. హామీలను అమలు చేయకపోగా కార్మికులకు నష్టం వాటిల్లే చర్యలు చేపట్టి కార్మికులను మోసగిస్తుందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ విమర్శించారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని జగన్నాథం భవనంలో జిల్లా అధ్యక్షులు ఆకుల రాజు అధ్యక్షతన సిఐటియు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు ఆరు గ్యారంటీలతో పాటు ఉద్యోగులకు, కార్మికులకు.. కాంగ్రెస్ అనేక హామీలు ఇచ్చిందని గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా కార్మికుల సమస్యల పరిష్కారం గురించి ఊసే లేదన్నారు. ముఖ్యమంత్రి.. పారిశ్రామిక వేత్తలు, ఐటీ అధిపతులు, ఫార్మా యాజమాన్యాలతో పాటు మధ్యతరగతి పరిశ్రమల యాజమాన్యాలు, పెద్ద పెద్ద కాంట్రాక్టర్లతో అనేకమార్లు చర్చలు జరిపారని, కానీ ఒక్కసారి కూడా కార్మిక సంఘాలతో చర్చించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరు నెలలుగా కార్మిక సంఘాలకు అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వడంలేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక యాజమాన్యాల ఒత్తిడికి తలొగ్గిందని, 73 షెడ్యూల్డ్ పరిశ్రమల్లో పని చేస్తున్న కార్మికులకు పైసా పెంచకుండా నూతన జిఒలను జారీచేసి కార్మికుల్ని మోసం చేసిందని తెలిపారు. అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆశ వర్కర్లకు మరల పరీక్ష పెట్టే విధానాన్ని అమలు చేస్తుందని, అంగన్‌వాడీలకు నష్టం చేసే విధంగా రిటైర్మెంట్ బెనిఫిట్స్ తగ్గించి జీవో 10ని జారీ చేసిందని అన్నారు. గ్రామపంచాయతీ కార్మికులకు ఎనిమిది నెలలుగా వేతనాలు లేక అవస్థలు పడుతున్నా చోద్యం చూస్తుందని విమర్శించారు. ఐకెపి విఒఎలు, మధ్యాహ్న భోజన, మున్సిపల్, అసంఘటిత రంగ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. కార్మికుల డిమాండ్ల పట్ల రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించకపోతే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్, జిల్లా కార్యదర్శి కుంట ఉపేందర్, జిల్లా ఆఫీస్ బేరర్స్ సమ్మెట రాజమౌళి, కందునూరి శ్రీనివాస్, దుండి వీరన్న, కుమ్మరికుంట్ల నాగన్న, పోతుగంటి మల్లయ్య, చింతా మౌనిక, తాడబోయిన శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ఓటాన్ అకౌంట్‌కు దగ్గరగా పద్దు

- పూర్తి స్థాయి బడ్జెట్‌పై ప్రభుత్వం కసరత్తు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'మా ప్రభుత్వం వచ్చిన తర్వాత పూర్తిస్థాయి బడ్జెట్‌ను జులైలో ప్రవేశపెట్టబోతున్నాం. ఈనెల 18 నుంచి శాఖల వారీగా ప్రతిపాదనలు తీసుకుంటాం. ఇందుకోసం మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులతో క్రమం తప్పక సమావేశాలు నిర్వహిస్తాం...' దాదాపు నెల రోజుల కిందట ఆర్థికశాఖ నుంచి వెలువడిన ప్రకటన ఇది. అందులో చెప్పినట్టుగానే కొద్ది రోజులు పలువురు మంత్రులతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశాలు నిర్వహించారు. ఆయా శాఖల నుంచి ప్రతిపాదనలు స్వీకరించారు. వ్యవసాయం, రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల నుంచి ప్రతిపాదనలు స్వీకరించారు. మంత్రులు తుమ్మల, పొంగులేటి, సీతక్కతో సమాలోచనలు జరిపారు. వారి శాఖలకు ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో ఎన్ని నిధులు కేటాయించారు..? వాటిలో ఎంత మొత్తం ఖర్చయింది..? ఇప్పుడు ఎంత మొత్తంలో నిధులు కావాలి...? అనే అంశాలపై కూలంకుశంగా చర్చించారు. ఆ మేరకు ఆయా శాఖల ఉన్నతాధికారులు మీడియాకు వివరాలను కూడా వెల్లడించారు.

కానీ ఆ తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. వ్యవసాయం, రెవెన్యూ, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు మినహా మిగతా ఏ ఒక్క శాఖ నుంచి కూడా ఆర్థిక శాఖ ప్రతిపాదనలను స్వీకరించలేదు. ఆయా మంత్రులతో సమావేశాలు నిర్వహించలేదు. దీంతో మిగతా డిపార్టుమెంట్ల ప్రతిపాదనలేంటి..? వాటికి ఎన్నేసి నిధులను కేటాయించబోతున్నారు..? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈనెల 23న కేంద్రం తన పూర్తి స్థాయి బడ్జెట్‌ను పార్లమెంటుకు సమర్పించనుంది. ఈ క్రమంలో ఈనెల 26న రాష్ట్ర ప్రభుత్వం కూడా తన పూర్తి స్థాయి బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశపెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. శాఖల నుంచి ప్రతిపాదనలు తీసుకోకుండా, మీటింగులు నిర్వహించకుండా కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన రెండు మూడు రోజులకే ఇక్కడెలా పద్దును ప్రవేశపెడతారనే సందేహాలు ఇప్పుడు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి కేంద్ర బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత అక్కడి నుంచి వచ్చే ఆర్థిక సాయాలు, గ్రాంట్లు, ఇతర ప్యాకేజీలపై లెక్కలేసుకుని, ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెడుతుంది. ఈ కసరత్తులు చేయటానికి కనీసం వారం నుంచి పది రోజులు పడుతుంది. ఇది ఎన్నో ఏండ్ల నుంచి వస్తున్న ఆనవాయితీ. కానీ అందుకు భిన్నంగా ఇప్పుడు రెండు మూడు రోజుల వ్యవధితోనే పద్దును ప్రవేశపెట్టటం ఎలా సాధ్యం...? అంటూ ఆర్థిక నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయమై ప్రభుత్వ వర్గాలను ఆరా తీయగా... 'మొన్న ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్‌కు ఓ ఐదు శాతమో, పది శాతమో పెంచి, ప్రతి శాఖకూ అదనంగా నిధులు కేటాయిస్తారు..ఆ కోవలోనే పద్దును రూపొందిచబోతున్నారు...' అంటూ వ్యాఖ్యానించారు. ఆర్థిక శాఖ మంత్రి అయిన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క... ఇటు పార్టీ, అటు ప్రభుత్వ కార్యక్రమాల్లో బిజీబిజీగా ఉండటం, సమయం తక్కువగా ఉండటంతోనే మిగతా శాఖలు, మంత్రులతో సమావేశాలు నిర్వహించలేకపోయారని తెలిసింది.

డిఎస్‌సి రద్దు కుదరదు

- ఆరు వేల పోస్టులతో త్వరలో మరో డిఎస్‌సి
- త్వరలో జాబ్ క్యాలెండర్ విడుదల
- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

డిఎస్సీ పరీక్షలకు అన్ని సిద్ధం చేశామని, రద్దు చేయడం కుదరదని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. కొంతమంది ఆ పరీక్ష వాయిదా చేయాలంటూ చేయడం తగదన్నారు. దీనివల్ల అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరువేల పోస్టులతో మరో డిఎస్‌సి త్వరలోనే నిర్వహిస్తామని భరోసా ఇచ్చారు. దీంతోపాటు జాబ్ క్యాలెండర్ విడుదలకు వేగంగా ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఐదు వేల పోస్టులతో నోటిఫికేషన్లు ఇచ్చి పరీక్షలు నిర్వహించకపోవడంతో తమ ప్రభుత్వం రాగానే 11 వేలకు పైగా పోస్టులతో మళ్లీ నోటిఫికేషన్ ఇచ్చామని గుర్తు చేశారు. 16 వేల టీచర్ పోస్టులుఖాళీగా ఉన్నట్టు గుర్తించామని, 19,718 టీచర్ల ప్రమోషన్లు, బదిలీలు చేపట్టామని వివరించారు. ఇప్పటికే రెండు లక్షల 500కు పైగా అభ్యర్థులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారని వివరించారు. మొత్తం రెండు లక్షల 79 వేలమంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. పదేళ్ళడిఎస్‌సిని ఎందుకు నిర్వహించలేదని బిఆర్ఎస్‌ని ప్రశ్నించారు. ఎన్నికలకు ముందు నోటిఫికేషన్ విడుదల చేసి ఓట్ల కోసం తాపత్రయ పడ్డారని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం నిరుద్యోగులను గాలికి వదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిఎస్‌సిని కూడా పకడ్బందీగా నిర్వహిస్తామని తెలిపారు. మరో డిఎస్‌సి నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని వివరించారు. త్వరలోనే పోస్టుల సంఖ్యతో నోటిఫికేషన్ విడుదల చేస్తామని ప్రకటించారు. అందరూ మంచిగా సన్నద్ధం ఉద్యోగాలు సాధించి విద్యార్థులకు మంచి విద్యను అందించాలని కోరారు. తమ ప్రభుత్వం రాగానే గ్రూప్ వన్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసి పరీక్షలు నిర్వహించి ఫలితాలు ప్రకటించామని గుర్తుచేశారు. గత ప్రభుత్వంలో పేపర్ లీకేజీలతో నిరుద్యోగ యువకులు తీవ్రంగా నష్టపోయిన విషయాన్ని గుర్తించామని అన్నారు. గ్రూప్ 2 కూడా గత ప్రభుత్వం మూడు సార్లు వాయిదా వేసిందని తెలిపారు. తమ ప్రభుత్వం మళ్లీ పరీక్షలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసిందన్నారు. గ్రూప్ 3 కూడా నిర్వహించలేకపోతే మళ్లీ తాము షెడ్యూల్ చేశామని తెలిపారు. ఇవన్నీ నిరుద్యోగులకు నష్టం కలగొద్దని తమ ప్రయత్నం చేసిందని తెలిపారు. ఇవి కాక వివిధ శాఖల్లో పోస్టులు 13321 టిజిపిఎస్‌సి ఆధ్వర్యంలో భర్తీ చేస్తున్నామన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో పేపర్ లీకేజీలతో విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కొట్లాడి రాష్ట్రాన్ని తెచ్చుకున్నది ఉద్యోగాల కోసమేనన్నారు. అనేక ఉద్యమాలు, విద్యార్థుల ఆత్మబలిదానాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని చెప్పారు. అందుకే తమ ప్రభుత్వం ఉద్యోగాలపై దృష్టి సారించిందని, ఇప్పటికే 30 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని వెల్లడించారు. . ఈ విషయాన్ని రాష్ట్ర ప్రజలు, నిరుద్యోగ, యువతీ యువకులకు గమనించాలని విక్రమార్క విజ్ఞప్తి చేశారు.

పెన్షన్ రికవరీలు ఆపండి : సిఎస్ ఉత్తర్వులు

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

డబుల్ పెన్షన్లు తీసుకుంటున్న వారి నుంచి పెన్షన్ రికవరీలు నిలుపుదల చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో చర్చించి, విధివిధానాలు ఖరారు చేశాక నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. సంక్షేమ పథకాల్లో అనర్హులు లబ్ధి పొందినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందనీ, అర్హులు మాత్రమే లబ్ధిపొందేలా త్వరలోనే స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేస్తామని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అప్పటి వరకు ఎవరికీ రికవరీ నోటీసులు ఇవ్వొద్దని ఆదేశించారు. డబుల్ పెన్షన్లు తీసుకుంటున్న 1,826 మందికి ప్రభుత్వం రికవరీ నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. దీనిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కే తారకరామారావు 'ఎక్స్' వేదికగా తప్పుపట్టారు. వృద్ధులకు ఇచ్చే పెన్షన్లను రేవంత్‌రెడ్డి సర్కారు రికవరీ చేస్తూ, మానవత్వం లేకుండా వ్యవహరిస్తున్నదని ట్వీట్ చేశారు. దీనిపై ప్రభుత్వం కూడా వివరణ ఇచ్చింది. తాజాగా ఆదివారం సీఎస్ శాంతికుమారి పై ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్ఐ శ్రీనివాస్ కుటుంబానికి..

2014 ఎస్ఐ బ్యాచ్ రూ.25 లక్షల ఆర్థికసాయం

హైదరాబాద్ బ్యూరో: అధికారుల వేధింపులతో మనస్థాపం చెంది ఇటీవల ఆత్మహత్య చేసుకున్న అశ్వారావుపేట ఎస్ఐ శ్రీరాముల శ్రీనివాస్ కుటుంబానికి 2014 ఎస్ఐ బ్యాచ్ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వెల్ఫేర్ సొసైటీ పేరుతో రూ.25లక్షలు ఆర్థికసాయం ఆదివారం అందజేశారు. శ్రీనివాస్ స్వగ్రామమైన హన్మకొండ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేట గ్రామానికి వెళ్లి.. ఆయన కుటుంబసభ్యులను కలిసిన సొసైటీ సభ్యులు.. శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరంకుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేశారు.

ఆకస్మిక తనిఖీలు, పరిశీలనలు

- ప్రజా క్షేత్రంలోకి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్
- ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరా
- ప్రతి నెలా సిఎస్‌కు 'టూర్ డైరీ' రిపోర్టు

విద్యార్థులతోక మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ఇక నుంచి ఒక లెక్క.. ఇప్పటి నుంచి మరో లెక్క' అన్నట్టుగా సాగనుంది మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ పాలన. మొన్నటి వరకు వరుస ఎన్నికలు, నామినేషన్లు, ఓట్ల లెక్కింపు, ఫలితాల బిజీలో ఉన్న కలెక్టర్.. ఇక నుంచి నేరుగా ప్రజా క్షేత్రంలోకి వెళ్లనున్నారు. ప్రజలకు అందుతున్న ప్రభుత్వ పథకాలు, సేవల గురించి స్వయంగా ఆరా తీయనున్నారు. ముఖ్యంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నారు. కలెక్టర్లు క్షేత్ర స్థాయి పర్యటనలు చేయాలని సిఎస్ నుంచి ఉత్తర్వులు రావడంతో కలెక్టర్ నేరుగా ప్రజలతో మమేకం కానున్నారు.

జిల్లా కలెక్టర్లు వరుస ఎన్నికల నేపథ్యంలో పాలనపై పెద్దగా దృష్టి సారించలేకపోయారు. కలెక్టర్లు, జిల్లా స్థాయి అధికారులు కార్యాలయాలకే పరిమితం అవుతున్నారని భావించిన ప్రభుత్వం, వీరి పరితీరుపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నెల 2వ తేదీన అన్ని ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో సిఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్ల పనితీరుపై అసహనం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. కలెక్టర్లు క్షేత్ర స్థాయి పర్యటనలకు వెళ్లేలా చూడాలని ముఖ్య కార్యదర్శులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో సీఎస్ తాజాగా ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్లు కార్యాలయాలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయి పర్యటనలకు వెళ్లాలని ప్రభుత్వం ఆదేశించింది. వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు కూడా పర్యటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాల్లో పేర్కొంది. లబ్దిదారులు, స్థానిక ప్రభుత్వ సిబ్బందితో మమేకం కావాలనీ, వారితో ఇష్టాగోష్టిగా మాట్లాడి, పథకాలు, కార్యక్రమాలు ఏ మేరకు చేరుతున్నాయి వంటి వివరాలను సేకరించాలని నిర్దేశించింది.

ఈ అంశాలపై స్పెషల్ ఫోకస్..

జిల్లా కలెక్టర్లు ముఖ్యంగా పది అంశాలను ప్రత్యేకంగా పరిశీలించాలని సిఎస్ ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, జిల్లా ఆస్పత్రుల పనితీరును తనిఖీ చేయాలి. ప్రజలకు ఆరోగ్య సేవలు ఎలా అందుతున్నాయన్న వంటి వివరాలను పరిశీలించాలి. పాఠశాలలను తనిఖీ చేసి విద్యార్థులు ఏ మేరకు నేర్చుకుంటున్నారు..? ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటున్నారా..? మధ్యాహ్న భోజనం ఎలా ఉంది..? వంటివి అంచనా వేయాలి. నీటి సరఫరా, పారిశుధ్యంపై తనిఖీలు చేయాలి. ప్రజలకు సురక్షిత నీరు అందుబాటులో ఉందా..? పారిశుధ్య నిర్వహణ ఎలా ఉంది..? మరుగుదొడ్ల నిర్వహణను పరిశీలించనున్నారు. గ్రామాలు, మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో రోడ్ల పరిస్థితి, ప్రజా రవాణా, ఇతర మౌలిక సదుపాయాలను సమీక్షించాలి. లబ్దిదారులకు బియ్యం, ఇండ్లు, ఇతర ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా..? అనే వివరాలను సేకరించాలి. వృద్ధులు, వికలాంగులు, వితంతువుల పింఛన్లు వంటి సాంఘిక సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా మహిళలు, శిశువులకు అందుతున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను తనిఖీ చేయాలి. మున్సిపాల్టీల్లో అన్ని కార్యక్రమాలు, పథకాల అమలు తీరును పర్యవేక్షించాలి. ముఖ్యంగా టౌన్ ప్లానింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి.

ఇప్పటికే సమీక్షలు, ఆకస్మిక తనిఖీలు

సిఎస్ నుంచి ఉత్వర్వులు రావడంతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ రంగంలోకి దిగారు. ఇప్పటికే వనమహోత్సవంపై సమీక్షా సమావేశం నిర్వహించిన కలెక్టర్.. మున్సిపాల్టీలు, ఎంపిడిఒలు, జిల్లా అధికారులకు కేటాయించిన లక్ష్యాలపై దిశా నిర్దేశం చేశారు. అలాగే అమ్మ ఆదర్శ పాఠశాలలు, ప్రజాపాలన కేంద్రాలు, మహిళా శక్తి కార్యక్రమాలపై సమీక్షించారు. ఉప్పల్, జవహర్‌నగర్‌లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పిహెచ్‌సిల్లో ఎమర్జెన్సీ అండ్ డ్రెస్సింగ్, ఇమ్యూనైజేషన్, ఫార్మసీ, ఆపరేషన్ థియేటర్, ఇన్‌పేషెంట్ రూంలను పరిశీలించారు. బీపీ, షుగర్ టాబ్లెట్లు, ల్యాబ్ పరికరాలు, కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, సీజన్ వ్యాధుల గురించి ఆరా తీశారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ పనితీరును పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో కలెక్టర్ ముచ్చటించారు. విద్యా బోధన గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాలల్లో డైనింగ్ హాల్, తాగునీరు, వాష్ ఏరియా లాంటి మౌలిక సదుపాయాలను తనిఖీ చేశారు. ఈ నెల 16వ తేదీన ముఖ్యమంత్రితో సమావేశం అనంతరం కలెక్టర్ పాలనలో మరింత దూకుడు పెంచనున్నారు.

ప్రతి నెలా సీఎస్‌కు రిపోర్టు

జిల్లా కలెక్టర్ నెలలో ఏయే పనులు చేశారు..? ఎన్ని తనిఖీలు, సమీక్షలు, పర్యటనలు చేశారు వంటి వివరాలన్నింటితో ప్రతి నెలా 5వ తేదీలోగా 'టూర్ డైరీ'ని రూపంలో సిఎస్‌కు నివేదిక పంపాలి. ఇలా పంపిన కలెక్టర్ల క్షేత్ర స్థాయి పర్యటనలు, నిబద్ధత వంటి అంశాలను కలెక్టర్ల పనితీరును అంచనా వేసే సందర్భంలో పరిగణలోకి తీసుకుంటారు. ఈ రిపోర్టు ఆధారంగానే కలెక్టర్లకు రివార్డులు, పనిష్మెంట్లు ఉండనున్నాయి.

రియాజ్‌కు టిజిజెఎల్ఎ 475 అభినందనలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ రియాజ్‌కు తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 సంఘం అభినందనలు తెలిపింది. ఆదివారం ఈ మేరకు రియాజ్‌కు ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు, డాక్టర్ వసుకుల శ్రీనివాస్, డాక్టర్ కొప్పిశెట్టి సురేష్, నాయకులు పి జగన్నాథం, సంగీత, విశాలాక్ష్మి, రజిత, లావణ్య శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సురేశ్, శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యావేత్త, పోటీపరీక్షల నిపుణుడు, అభ్యుదయ వాది గ్రంథాలయ చైర్మన్‌గా నియమితులు కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గతంలో తమకు హామీ ఇచ్చిన విధంగా రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలకు ఉచితంగా దినపత్రికలు, పోటీపరీక్షల మ్యాగజైన్లు వేయించాలని కోరారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివే బీద విద్యార్థులకు పోటీ పరీక్షలపై అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

హాస్టల్‌లో తమ పిల్లలను కలిసేందుకు వచ్చి... రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలంలోని దాస్ నగర్ సమీపంలో ఉన్న జ్యోతిబా పూలే హాస్టల్ వద్ద అతి వేగంగా వచ్చిన కారు.. నడుచుకుంటూ వెళుతున్న వారిని ఢీ కొట్టడంతో అక్కడిక్కడే ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరికీ తీవ్ర గాయాలయిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. సిఐ సతీష్ వెల్లడించిన వివరాల ప్రకారం.. దాస్‌నగర్ సమీపంలోని జ్యోతిభా పూలే హాస్టల్ విద్యార్థినిలను కలవడానికి ప్రతినెలా రెండవ ఆదివారం తల్లి దండ్రులు వస్తుంటారు. వారి పిల్లలకు ఇంటి నుంచి తెచ్చిన భోజనాన్ని తినిపించి కొద్ది సేపు పిల్లలతో గడిపి వెళుతుంటారు. ఈ నేపథ్యంలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని హారికను కలిసేందుకు.. ఇందాల్‌వాయి మండలం సిర్నపల్లి గ్రామానికి చెందిన విద్యార్థి తల్లి నీలా, అమ్మమ్మ కొత్తూరు పోషమ్మ (60) వచ్చారు. వీరు హారికతో కొంత సమయం గడిపి ఇంటి నుంచి తెచ్చిన భోజనం తినిపించి తిరుగు ప్రయాణమయ్యారు. అలాగే, 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఈశ్వరిని కలిసేందుకు బోధన్ మండలం చిన్న మావంది గ్రామానికి చెందిన విద్యార్థి తల్లి పద్మ (35) వచ్చారు. ఈ క్రమంలో వీరు తిరిగి వెళుతూ.. హాస్టల్ బయట నడుస్తుండగా.. వీరి వెనక నుంచి అతి వేగంగా వచ్చిన కారు వారిని ఢీ కొట్టడంతో పద్మ, పోషమ్మ అక్కడికక్కడే మృతిచెందారు. విద్యార్థి ఈశ్వరికి తీవ్ర గాయాలవడంతో ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడినుంచి ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. హారిక తల్లి నీలాకు స్వల్పగాయాలవగా, ఆమె జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. మృతులను జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. ఈ సంఘటనా స్థలాన్ని పరిశీలించిన వారిలో సిఐతో పాటు నవీపేట్ ఎస్ఐ యాదగిరి గౌడ్, రూరల్ ఎస్ఐ మహేష్, స్థానిక ఎస్ఐ సుదీర్ రావు ఉన్నారు.

అత్తాపూర్‌లో కాంచీపురం మంగళగౌరి షోరూం ప్రారంభం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

అత్తాపూర్‌లో పిల్లర్ నెంబర్ 142కి ఎదురుగా కాంచీపురం మంగళగౌరి షోరూంను ప్రముఖ టాలీవుడ్ నటి ఫరియా అబ్దుల్లా, యాంకర్ సుమ కనకాల ప్రారంభించారు. కుటుంబంలో అన్ని తరాలవారి అభిరుచులకు అనుగుణంగా నాణ్యమైన దుస్తులను లేటెస్ట్ డిజైన్లతో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు కంపెనీ డైరెక్టర్లు తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఆషాడం కేజీ సేల్ 50శాతం వరకు తగ్గింపు ఆఫర్ అందుబాటులో ఉంది. దక్షిణ భారత దేశంలో ఇతర నగరాలకు తమ శాఖలను విస్తరించ నున్నట్లు సంస్థ డైరెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు.

'డబుల్' ఇళ్లకు సదుపాయాలు కల్పించండి

- మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్
- సిపిఎం ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద ధర్నా

ధర్నాలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ నాగేశ్వర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రేటర్ హైదరాబాద్ శివారు ప్రాంతాల్లో గత ప్రభుత్వం నిర్మించిన 65 వేల డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లల్లో తగిన సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు ఇళ్లను స్వాధీనం చేయాలని మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు మాజీ ఎమ్మెల్సీ ప్రొఫెసర్ నాగేశ్వరరావు హాజరై మాట్లాడారు. డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల ప్రాంతాల్లో మంచినీటి సదుపాయం, కరెంటు, రోడ్డు, లిఫ్ట్ ఏర్పాటు చేయకపోవడంతో ఇండ్లు పొందిన పేదలు అందులో నివసించే పరిస్థితి లేదన్నారు. తక్షణమే ఈ సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సదుపాయాల కల్పనకు రూ.700 కోట్లు అవసరమని జిహెచ్ఎంసి, హౌసింగ్ అధికారులు చెబుతున్నారని, రాబోయే బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. బిఆర్ఎస్ ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాన్ని చాలా జాప్యం చేసిందని, కనీస సదుపాయాలు కల్పించకుండానే ఎన్నికల ముందు హడావిడిగా ఇళ్ల కేటాయింపు జరిపిందన్నారు. దాని కారణంగానే పేదలు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజలు అందులో నివసించకుండానే శిథిలావస్థకు చేరుతున్నాయని తెలిపారు. ఇండ్లను గత ప్రభుత్వం ఇచ్చిందన్న రాజకీయాలకు తావు లేకుండా డబులు బెడ్‌రూమ్ ఇళ్లల్లో సదుపాయాలు కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. సిపిఎం నగర కార్యదర్శి ఎం శ్రీనివాస్ మాట్లాడుతూ.. సదుపాయాల కల్పనకు కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో లబ్ధిదారులతో కలిసి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల సంక్షేమ సంఘం అధ్యక్షులు వి విజయకుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు కావాల్సింది ఇండ్లు అని, రాజకీయాలు కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ పేదలను అర్థం చేసుకోవాలన్నారు. ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడం ప్రభుత్వం బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం శ్రీనివాసరావు, ఎం దశరథ్, ఎం మహేందర్, ఐద్వా నగర కార్యదర్శి కె నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

26న గ్రామ పంచాయతీ కార్మికుల 'చలో హైదరాబాద్'

పెండింగ్ వేతనాల చెల్లింపు, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలను చెల్లించాలనీ, మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ప్రకటించారు. ఆదివారం హైదరాబాద్‌లో తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఆఫీస్‌బేరర్ల సమావేశం హైదరాబాద్‌లో ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.సుధాకర్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యక్రమంలో పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. గతంలో రైతులు, చేనేత కార్మికులు ఆత్మహత్యలు చేసుకునేవారని నేడు ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల ఫలితంగా గ్రామ పంచాయతీ కార్మికులు కూడా ఆత్మహత్యలు చేసుకుంటున్నారని తెలిపారు. రాష్ట్రంలో ఐదారు నెలల నుంచి వేతనాలు ఇవ్వకుంటే పంచాయతీ కార్మికుల కుటుంబాలు ఎలా గడుస్తాయని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తాము అధికారంలోకి రాగానే జీపీ కార్మికులకు వేతనాలు పెంచి పర్మినెంట్ చేస్తామనీ, రూ. 5 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను గుర్తుచేశారు. తక్షణమే పెండింగ్ వేతనాలు చెల్లింపు, మల్టీ పర్పస్ విధానం రద్దు, కార్మికుల పర్మినెంట్ హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఈ నెల 26న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తామని హెచ్చరించారు. పంచాయతీ కార్మికుల ఆకలికేకల పేరుతో జూలై 18-19 తేదీల్లో అన్ని మండల కేంద్రాల్లో ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ప్రజలకు తెలియజేస్తూ బిక్షాటన చేయాలనీ, 22న "ప్రజావాణిలో" జిల్లా కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య, రాష్ట్ర ఆఫీస్ బేరర్లు పైళ్ల గణపతిరెడ్డి, పొట్ట యాదమ్మ, శంకర్, మల్లేష్, మాల్యాల నర్సయ్య, బండ్ల అప్పిరెడ్డి, మండ్ల రాజు తదితర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు నాయకులు

ఏకలవ్య పాఠశాలల పోస్టుల భర్తీలో అన్యాయం

- టిఎజిఎస్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో జూనియర్ సెక్రెటేరియట్ అసిస్టెంట్, టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టుల భర్తీలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి అన్యాయం చేసిందని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టిఎజిఎస్) తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మిడియం బాబురావు, పూసం సచిన్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గిరిజన మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్ల సొసైటీలో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) ద్వారా 707 జూనియర్ సెక్రెటేరియట్ అసిస్టెంట్ (జెఎస్ఎ) పోస్టులు, టీచింగ్, నాన్ టీచింగ్ 7,702 పోస్టులు దేశవ్యాపితంగా భర్తీ చేసిందని తెలిపారు. ఇందులో తెలంగాణ రాష్ట్రంలోని 46 జెఎస్ఎ పోస్టులను భర్తీ చేసిందని, ఇందులో 43 మందిని కేవలం ఒక్క హర్యానా నుంచి ఎంపిక చేసిందని పేర్కొన్నారు. మరో ఇద్దరు డిల్లీ నుంచి ఒకరు రాజస్థాన్ నుంచి ఎంపిక చేశారని తెలిపారు. తెలంగాణ, ఇతర దక్షిణాది రాష్ట్రాల నుంచి ఒక్కరు కూడా లేకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం హిందీని బలవంతంగా దేశవ్యాపితంగా ప్రజలపై రుద్దే ప్రయత్నంలో భాగంగానే హిందీ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులను ఎంపిక చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. అందులోనూ ఒక రాష్ట్రం వారినే పెద్దసంఖ్యలో ఎంపిక చేయడం అనేది పరీక్ష నిర్వహణ, అభ్యర్థులను ఎంపిక చేసిన సంస్థ పారదర్శకతపై అనుమానాలొస్తున్నాయని పేర్కొన్నారు. ఇది దక్షిణాది, హిందీయేతర రాష్ట్రాలను, ఆ రాష్ట్రాల సంస్కృతిని కేంద్రప్రభుత్వం అవమానించినట్టు కాదా?అని ప్రశ్నించారు. వెంటనే ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉద్యోగాలభర్తీకి నిర్వహించిన పరీక్షలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షలు నిర్వహించిన సంస్థ ఎఎన్ఎను బ్లాక్‌లో పెట్టి, మళ్లీ పరీక్షలు నిర్వహించి అన్ని రాష్ట్రాలకు సమాన అవకాశాలు కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు.

కాచిగూడ హాస్టల్‌ను రీ ఓపెన్ చేయాలి

- లేకుంటే పెద్దఎత్తున పోరాటం
- కాచిగూడ హాస్టల్ రీ-ఓపెన్ పోరాట సమితి

నిరసన చేస్తున్న పోరాట సమితి నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాచిగూడ హాస్టల్‌ను వెంటనే రీ ఓపెన్ చేయించాలని కాచిగూడ హాస్టల్ రీ-ఓపెన్ పోరాట సమితి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరింది. హైదరాబాద్‌లో ఓ ప్రయివేటు బిల్డింగ్‌లలో ఉంటున్న విద్యార్థులు కాచిగూడ హాస్టల్‌ను ఆదివారం సందర్శించారు. అక్కడ నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. హాస్టల్‌ను తెరిపించకపోతే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు.

కార్యక్రమంలో పూర్వ విద్యార్థి రుద్రవరం లింగస్వామి, గిరి, బొమ్మెర రామ్మూర్తి, సంగమేశ్వర్, కిరణ్, చారి, జగదీష్, రాము, గోవిందు, గణేషు, రమేష్ నవీన్ తదితరులు పాల్గొన్నారు. లింగస్వామి మాట్లాడుతూ...ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే అతిపెద్ద సాంఘిక సంక్షేమ బాలుర కాలేజ్ హాస్టల్ కాచిగూడదే అని గుర్తు చేశారు. దళిత సామాజిక తరగతికి చెందిన చాలామంది ఆయా రంగాల్లో ఉన్నత స్థాయిలో ఉండటానికి ఆ హాస్టల్ ఎంతో దోహదపడిందన్నారు. అలాంటి హాస్టల్‌ను ఐదేండ్లుగా మూసేయడం దారుణమన్నారు. షెడ్యూల్ కులాల విద్యార్థులను విద్యకు దూరం చేసే విధంగా సాంఘిక సంక్షేమ అధికారులు, పాలకులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అనేక సాకులతో ఆ హాస్టల్ విద్యార్థులకు బలవంతంగా వేరేచోటికి తరలించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అలా చేయకుండా కాచిగూడ హాస్టల్‌ను వెంటనే తెరిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రయివేటు బిల్డింగుల యాజమాన్యాలకు కిరాయిల పేరిట కోట్ల రూపాయల అద్దెలు చెల్లిస్తున్నారనీ, అవే డబ్బులతో శాశ్వతంగా వసతి గృహ సముదాయాలను కట్టించవచ్చునని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం దళిత విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

భావం శిల్పం ప్రాధాన్యం గా ' వష్ట' కథలు

ప్రజాశక్తి కల్చరల్

లేఖిని రచయిత్రుల వేదిక, త్యాగరాయగానసభ సౌజన్యంతో శ్యైలజామిత్ర రచించిన "వష్టి" కథల సంపుటి ఆవిష్కరణ సభ శ్రీ త్యాగరాయ గాన సభలోని లలిత కళా వేదికపై జరిగింది. ఈ సభలో ముఖ్యఅతిథి, పాల్గొన్న ప్రముఖ రచయిత, సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత సయ్యద్ సలీం సంపుటిని ఆవిష్కరించి మాట్లాడుతూ శ్యైలజామిత్ర కథల్లో చక్కని భావం, శిల్పం ఉన్నాయని, సమాజపరంగా ఎంతో అవసరమైన కథలు అభినందించారు, కథా రచనలో ఒక ప్రత్యేక ముద్ర ఉందని అభిప్రాయబడ్డారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న రచయిత్రి డాక్టర్ ఆలూరి విజయలక్ష్మి మాట్లాడుతూ శ్యైలజామిత్ర రచించిన చాలా కథలు ఎంతో ప్రయోజనాత్మకంగా ఉన్నాయని, చదువుతున్నంత సేపూ ఎంతో ఆసక్తిగా అనిపించాయని తెలియజేసారు. సభాధ్యక్షులుగా పాల్గొన్న అత్తలూరి విజయలక్ష్మి మాట్లాడుతూ దాదాపు ముప్పైఏళ్లుగా శ్యైలజామిత్ర రచనా పరంగా ఎంతో ఉన్నతంగా, ఎత్తుకు ఎదిగారని అన్నారు. ప్రముఖ రచయిత్రులు కస్తూరి అలివేణి, సరస్వతి కరవది, షామీర్ జానకీదేవి గార్లు గ్రంథాన్ని సమీక్షించారు. కుసుమా ఉప్పలపాటి ప్రార్థనా గీతం ఆలపించారు.రచయిత్రి శ్యైలజామిత్ర స్పందనను తెలియజేసారు. కృతి స్వీకర్త శ్రీ సత్యమిత్ర ధన్య వాదాలు తెలిపారు. హవిష స్వాగతం, వందన సమర్పణ చేసారు.

సంజయ్ కిషోర్‌కు ఆత్మీయ సత్కారం

ప్రజాశక్తి కల్చరల్

ప్రముఖుల ఫొటోబయోగ్రఫీ రచయిత సంజయ్ కిషోర్‌ను రాజమండ్రికి చెందిన ప్రఖ్యాత సాంస్కృతిక సంస్థ నవ రాస నట సమాఖ్య సంస్థ ఆత్మీయ సత్కారం చేశారు పార్లమెంట్ పూర్వ సభ్యులు ఉండవల్లి అరుణ్ కుమార్ హర్ష వర్ధన్ పూర్వ శాసన సభ్యుడు రౌతు సూర్య ప్రకాశ రావు, ప్రముఖ సినీ నటుడు గాయకుడు జిత్ మోహన్ మిత్రా తదితరులు పాల్గొని సంజయ్ కిషోర్ ను సత్కరించారు వారు మాట్లాడుతూ కిషోర్ సావిత్రి క్లాసిక్స్ సంపుటి ముచ్చటగా ఛాయా చిత్రాలు సహితంగా అందించారు అని అభినందించారు. భారత పూర్వ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు జీవిత ఛాయా చిత్ర మాలిక గ్రంథాన్ని సంజయ్ రూ పొందించగా ప్రధాని మోడీ వర్చువల్‌గా ఆవిష్కరించారు.

మంగ్ల ట్యూబ్ పరిశ్రమలో.. సెక్యూరిటీగార్డ్ అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని బూచినెల్లి గడ్డపై ఉన్న ఇండస్ట్రియల్ పార్కులోని 'మంగ్ల ట్యూబ్' పరిశ్రమలో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీగార్డ్ ఆదివారం అనుమాన్పాదంగా మృతి చెందారు. యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే ఘటన జరిగిందని మృతుని కుటుంబ సభ్యులు పరిశ్రమ వద్ద ఆందోళనకు దిగారు. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. జహీరాబాద్ పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన శివకుమార్ (62) కొన్నేళ్లుగా గ్లోబల్ సెక్యూరిటీ సర్వీసెస్‌లో సెక్యూరిటీ గార్డ్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆదివారం సెక్యూరిటీగార్డ్‌గా మంగ్ల పరిశ్రమలో విధులకు వెళ్లిన శివకుమార్.. అనుమానాస్పదంగా మృతి చెందాడు. అయితే హార్ట్ ఎటాక్ రావడంతో మృతి చెందినట్టు పరిశ్రమ యాజమాన్యం చెబుతోంది.

ఈ విషయమై శివకుమార్ బంధువులు, స్నేహితులు ఆందోళనకు దిగారు. మృతునికి ముగ్గురు పిల్లలు ఉన్నారని, వారి కుటుంబాన్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇదే విషయమై స్థానికులు పరిశ్రమ యజమాన్యంతో చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. కాగా ఇంతవరకు తమకు ఎలాంటి రాతపూర్వక ఫిర్యాదు అందలేదని చిరాకుపల్లి పోలీసులు చెబుతున్నారు. ఫిర్యాదు అందితే దర్యాప్తు చేస్తామని తెలిపారు. కార్మికులతో పరిశ్రమ యాజమాన్యం 24 గంటల పాటు విధులు నిర్వహించుకుంటున్నా.. వారికి కనీసం ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కూడా కల్పించట్లేదని మాజీ కౌన్సిలర్ రాములు నేత ఆరోపించారు. దాంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

విద్యార్థికి ఐ ప్యాడ్‌ను అందజేస్తున్న హరిశ్‌రావు

పది ఫలితాలు గర్వకారణం

- నా గుండె సిద్దిపేట, సిద్దిపేట అని కొట్టుకుంటుంది
- భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానం సాధించాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మిమ్మల్ని కని పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రుల రుణం తీర్చుకునే అవకాశముందని, పదవ తరగతి ఫలితాలను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో మంచి స్థాయికి చేరుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. ఆదివారం సిద్దిపేట ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి ఫలితాల్లో 10/10 జిపిఎ సాధించిన 75 మంది విద్యార్థులకు సొంత ఖర్చుతో ఒక్కొక్కరికి రూ. పది వేల విలువైన ఐ ప్యాడ్స్‌ను హరీశ్‌రావు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట పదవ తరగతి ఫలితాల్లో వరుసగా ఐదు సార్లు అగ్రగామిగా నిలిచిందని, సిద్దిపేట పేరును నిలబెట్టిన మీకు అభినందనలని అన్నారు.

ఒక ఎమ్మెల్యేగా తనకు గర్వంగా ఉందని, సిద్దిపేట పేరు చరిత్ర పుటల్లో నిలిపారని, ఉత్తమ ఫలితాలు పొందినప్పుడు కలిగే అనుభూతి గొప్పదన్నారు. పదవ తరగతి ఫలితాలు వచ్చిన సమయంలో తాను అమెరికాలో ఉన్నానని, పిల్లల తల్లిదండ్రులతో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి అభినందనలు తెలిపానని తెలిపారు. ఎక్కడ ఉన్నా నా గుండె ఎప్పుడూ సిద్దిపేట కోసమే తపన పడుతుందని, అందరికి గుండె లయ లబ్ డబ్ కొట్టుకుంటుందని, అది తనకు మాత్రం సిద్దిపేట, సిద్దిపేట అని వినిపిస్తుందని అన్నారు. మంచి ర్యాంక్ వస్తే ఇంటి పెద్ద, తండ్రి ఎలా సంతోషంగా ఉంటాడో అలాగే తనకు సంతోషంగా ఉందన్నారు. అన్ని రకాలుగా విద్యార్థుల ఫలితాల కోసం తపన పడ్డానని, స్వంత ఖర్చుతో టిఫిన్, డిజిటల్ పుస్తకాలు ఇచ్చానని, పోయిన ఏడాది కంటే మన జిల్లా ఈసారి ఎక్కువ ఉత్తీర్ణత సాధించిందన్నారు. సిద్దిపేట నియోజకవర్గం రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్‌లో ఉందని, బాసరలో అత్యధికంగా సీట్లు వచ్చాయని, మీ ఫలితాలు భవిష్యత్తు తరాలకు స్ఫూర్తి కావాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజా ప్రతినిధులు రోజా శర్మ, ఫారూఖ్ హుస్సేన్, రాజనర్సు, రెడ్డి ప్రభాకర్ రెడ్డి, గుండు భూపేష్ తదితరులు పాల్గొన్నారు.

విభజన రాజకీయాలకు కాలం చెల్లింది

- ఎఐఐఇఎ నిర్విరామ కృషి ఫలితంగానే 17 శాతం వేతన సవరణ
- ఇన్సూరెన్స్ ప్రీమియంపై 18 శాతం జిఎస్‌టిని ఎత్తివేయాలి
- ఎఐఐఇఎ జోనల్ ప్రధాన కార్యదర్శి రవీంద్రనాథ్
- చైతన్యవంతంగా యూనియన్ 28వ వార్షిక మహాసభ

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశాన్ని, ప్రజల్ని మతం ప్రాతిపదికగా విభజించి ఓట్లు దండుకొని అధికారంలోకి రావాలన్న నీచమైన రాజకీయాలు ఇక ఎంతమాత్రం చెల్లవని ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఐఇఎ) జోనల్ ప్రధాన కార్యదర్శి టివిఎన్ఎస్ రవీంద్రనాథ్ అన్నారు. ఎల్ఐసీలోని అతిపెద్ద యూనియన్ ఎఐఐఇఎ కరీంనగర్ డివిజన్, ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్ 28వ మహాసభలు ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని పద్మనాయక కల్యాణ మండపంలో ప్రారంభమయ్యాయి. కరీంనగర్ డివిజన్ అధ్యక్షుడు జి.రవీంద్రనాథ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన హాజరై ప్రారంభించి మాట్లాడారు. దేశంలో, ఆ మాటకొస్తే ప్రపంచంలోనే ఎన్నికలను ఇంత అట్టడుగు స్థాయికి దిగజారేలా ఒక ప్రధానమంత్రి ప్రజలను ఆకర్షించడానికి మతాన్ని ఒక కీలకమైన అంశంగా తన ఉపన్యాసాల్లో ప్రస్తావిస్తూ ప్రజల్ని అవమానపరిచేలా, కించపరిచేలా వ్యవహరించడం వివాదాస్పదమైందన్నారు. అయినా చైతన్యవంతమైన ప్రజలు ఏ విభజన రాజకీయాలకు తావివ్వకుండా 400 సీట్లను ఆశించిన బీజేపీకి భంగపాటు కలిగించే విధంగా 240 సీట్లకు పరిమితం చేశారన్నారు. ప్రజాస్వామ్యంలో ఇది ఒక గొప్ప మార్పునకు సంకేతంగా భావించాలని తెలిపారు. అలాగే ఒక బలమైన ప్రతిపక్షం ఆధ్వర్యంలో రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి రక్షణ కలుగుతుందనే నమ్మకం బలపడిందని తెలిపారు.

ప్రజలు ఎన్డీఏ ప్రభుత్వానికి పరిమితమైన మెజారిటీ ఇచ్చినప్పటికీ అధికారంలోకి వచ్చిన 100 రోజుల్లోనే ఇన్సూరెన్స్‌లో సంస్కరణలు తీసుకొస్తామని చెప్పిన ప్రభుత్వం, ఇన్సూరెన్స్ రెగ్యులేటర్ ద్వారా తీసుకొచ్చే మార్పులన్నీ ప్రభుత్వ రంగ సంస్థ అయిన ఎల్ఐసీని నిర్వీర్యం చేస్తూ ఏమాత్రం ప్రజల సంక్షేమం పట్టని ప్రయివేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు లాభాలు చేకూర్చే విధంగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ తోడ్పాటు లేకపోయినా జూన్‌తో ముగిసిన త్రైమాసికానికి ఎల్ఐసీ అద్భుతమైన ప్రగతిని సాధిస్తూ మార్కెట్ లీడర్‌గా తన స్థానాన్ని సుస్థిరం చేసుకుందని తెలిపారు. ఏఐఐఈఏ నిర్విరామ కృషి ఫలితంగానే 17 శాతం వేతన సవరణ సాధించుకున్నట్టు తెలిపారు. ముఖ్యంగా వేతన సవరణకు ఆయువుపట్టు లాంటి బేసిక్ లోడింగ్‌లో తిరుగులేని పురోగతి సాధించుకున్నట్టు చెప్పారు. బీమా తదితర రంగాల్లో పెను సంక్షోభం ఏర్పడుతుందని, ప్రజాస్వామిక హక్కుల్లో భాగమైన ట్రేడ్ యూనియన్ హక్కుల ఉల్లంఘనపై సమిష్టి పోరాటం చేయాలన్నారు. ప్రజల విశ్వాసాన్ని, మద్దతును కాపాడుకుంటూ ప్రభుత్వ కుట్రల నుంచి ఎల్ఐసిని రక్షించి ప్రభుత్వ రంగంలోనే కొనసాగించడానికి 74 సంవత్సరాలుగా కృషిచేస్తున్నట్టు తెలిపారు.

రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి మాట్లాడుతూ.. ప్రజాపోరాటాల ముందు ఏ ప్రభుత్వమైనా దిగదుడుపే అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వాన్ని వ్యతిరేకించిన వారిపై ఇడి, ఐటి, సిబిఐతో దాడులు చేయిస్తూ, అరెస్టు చేసి జైళ్లకు పంపుతున్నారని విమర్శించారు. ఎల్ఐసిని నిర్వీర్యం చేసే కుట్ర జరుగుతుందని, దాన్ని కాపాడుకోవడానికి ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కాగా, ఈ మహాసభలు పలు తీర్మానాలు చేశారు. ఇన్సూరెన్స్ ప్రీమియం మీద విధిస్తున్న 18శాతం జీఎస్టీని వెంటనే ఎత్తివేయాలని, ఉద్యోగులందరికీ పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలన్నారు.

క్లాస్ 3, 4 క్యాడర్లలో ఉద్యోగ నియామకాల్ని వెంటనే చేపట్టాలని, ఏఐఐఈఏకు వెంటనే గుర్తింపు ఇవ్వాలని, కార్మికులకు రూ.26వేల కనీస వేతనాన్ని అమలు చేయాలని తీర్మానం చేశారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఐసిఇయు కరీంనగర్ డివిజన్ నూతన అధ్యక్షునిగా ఎ రామ్మోహన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా వి వామన్‌రావు, ఉపాధ్యక్షులుగా డి.సూర్యకళ, సంయుక్త కార్యదర్శులుగా పి.బసవేశ్వర్, సి.అనుపమ, ఆర్.రాజేశం, కోశాధికారిగా యం.శ్రీలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాగా, పదవీ విరమణ పొందిన ప్రస్తుత అధ్యక్షులు రవీంద్రనాథ్‌ను ఈ సందర్భంగా జోనల్, డివిజనల్ నాయకత్వం అన్ని శాఖల నాయకులు, సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ మహాసభలో.. యూనియన్ జోనల్ అధ్యక్షులు పి.సతీష్, సంయుక్త కార్యదర్శి జి తిరుపతయ్య, కోశాధికారి శ్రీనివాసన్, సికింద్రాబాద్ డివిజనల్ ప్రధాన కార్యదర్శి రఘు, ఎల్ఐసి క్లాస్1 అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.సత్యనారాయణ, ఎల్ఐసి డెవలప్‌మెంట్ ఆఫీసర్స్ సంఘం నాయకుడు వాసుదేవరెడ్డి, ఏజెంట్ సంఘం నాయకులు గట్టు రాజయ్య, సిఐటియు నాయకుడు రమేష్, బ్యాంక్ అధికారుల సంఘం నాయకుడు దామోదర్, ఎల్ఐసి ఒబిసి సంఘం నాయకులు సత్తయ్య, ఎల్ఐసీ వాలిక్ సంఘ నాయకులు బుచ్చయ్య, ఎల్ఐసీ పెన్షనర్ సంఘం ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంతం హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల వ్యాప్తంగా 13 ఎల్ఐసి బ్రాంచ్‌ల నుంచి నాయకులు, సుమారు 200 మంది సభ్యులు పాల్గొన్నారు.